# సంపాదకీయం

# రిజర్వేషన్లు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనుకబడిన కులాల రిజర్వేషన్లు 26% నుంచి 44%, షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లు 14% నుంచి 16% షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్లు 4% నుంచి 6% వరకు పెంచుతూ జూలై 6వ తేదీ నాడు ఒక నిర్ణయం తీసుకొంది. వెనుకబడిన కులాల రిజర్వేషన్లు 12,000 రూ.కంటే తక్కువ ఆదాయం ఉన్న వాళ్ళకే వర్తిస్తాయి.

ఈ పెరుగుదల తెలుగుదేశం ప్రభుత్వం దయతలచి ఇస్తున్నది కాదు. రాజ్యాంగం ప్రకారం [illegible] ఈ కులాలకు రిజర్వేషన్లు ఇవ్వబడినాయి. భారతరాజ్యాంగం లోని ఆర్టికల్ 15 ప్రకరణ 4, ఆర్టికల్ 16 ప్రకరణ 4 ఆదేశిక సూత్రాలలోని ఆర్టికల్ 46 ప్రకారం షెడ్యూల్డ్ కులాలు, తెగలు, సామాజిక విద్యా రంగాలలో వెనుకబడిన వర్గాలకు ప్రత్యేకరాయితీలు కల్పించాలి.

అసలు రాజ్యాంగంలో ఈ అంశాలు చోటు చేసుకోవడం కూడా సుదీర్ఘమైన పోరాటాల ఫలితమే. జ్యోతి బాయి పూలే, అంబెద్కర్, రామస్వామి నాయకర్ వంటివారు స్వాతంత్రోద్యమ కాలంలో నిమ్న కులాల అభివృద్ధికి చేసిన కృషి ఫలితంగానే అన్ని పార్టీలు నిమ్నకులాల అభ్యున్నతికి ప్రత్యేకరాయితీలు కల్పించవలసిన అవసరాన్ని గుర్తించాయి. తత్ఫలితంగా రాజ్యాంగంలో పైన పేర్కొన్న ఆర్టికల్స్‌ను పొందుపర్చారు.

అయితే ఈవిషయాల అమలు అంత సాఫీగా సాగలేదు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు వెంటనే కల్పించినా మిగతా వెనుకబడిన వర్గాల విషయంలో ప్రభుత్వం దాదాపు 1975 వరకు ఏమీ చేయలేదనే చెప్పాలి. అసలు రాజ్యాంగం కూడా మిగతా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఏంచేయాలన్నది స్పష్టంగా చెప్పలేదు. 340 ఆర్టికల్ ప్రకారం ప్రెసిడెంట్ వెనుకబడిన వర్గాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను సూచించటానికి కమీషన్ నియమించవచ్చు. మొట్టమొదటిసారిగా 1953లో కాకాసాహెబ్ కాలేల్కర్ ఆధ్వర్యంలో వెనుకబడిన వర్గాలను గుర్తించి వాటి అభివృద్ధికి తగు చర్యలు సూచించమని, ఒకకమీషన్‌ను నియమించింది. కమీషన్ కులం ప్రాతిపదికగా ఆర్థిక విద్యాస్థాయిలను పరిగణలోనికి తీసుకొని 319 వెనుక బడిన వర్గాల లిస్టు తయారు చేసింది. వాని అభివృద్ధికి చర్యలను సూచించింది. రిపోర్టు ఆధారంగా తగుచర్యలను తీసుకోవాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది. 1970ల వరకు ఏరాష్ట్ర ప్రభుత్వం కూడా వెనుకబడిన వర్గాల సంక్షేమంకోసం ఏచర్యలూ తీసుకోలేదు. మనరాష్ట్రంలో 1975నుంచి రిజర్వేషన్లు అమలయ్యాయి. 1981లో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి తగు చర్యలు పేర్కొనటానికి మురళీధరరావు అధ్యక్షతన ఒక కమిటీని నియమించారు. కమిటీ నివేదికను ఎవరూ పట్టించుకోనేలేదు.. ఇక్కడ ఒక విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది. నిమ్నకులాలు, వెనుకబడిన వర్గాలనుంచి ఒత్తిడి లేకుండా ప్రత్యేక రాయితీలు కల్పించి ఉండేవారు కాదు. ఈ రాయితీల అమలు కూడా వెనుకబడిన వర్గాలనుంచి ఒత్తిడిలేకుండా జరిగేది కాదు. ఎప్పుడైతే వెనుకబడిన వర్గాలనుంచి ఒత్తిడి వచ్చిందో అప్పటి నుంచే వాళ్ళ ఓట్లు సాధించుకోవడం కోసం ప్రత్యేక రాయితీలు కల్పించడం ప్రారంభమైంది. [మరో అంశం కూడా ప్రస్తావించకుండా రిజర్వేషన్ల పై ఒక నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదు. రిజర్వేషన్లు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఉపయోగించుకోగలుగుతారు. అయితే ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించినా ఆర్థికాభివృద్ధికి తగు చర్యలు తీసుకోదు. మొత్తంగా వెనకబడిన కులాలు తమ అభివృద్ధికి ఉద్యమిస్తే నిర్బంధాన్ని ప్రయోగిస్తుంది. సోషల్ వెల్‌ఫేర్ హాస్టల్స్ పరిస్థితిని మెరుగుపర్చటానికి ప్రయత్నిస్తున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వం 1978 నుంచి ఎట్లా నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదో వివరాలు చాలా మందికి తెలుసు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, మిగులు భూమి పంపకం, కనీసవేతనాలు, వంటి సమస్యల కోసం కృషి చేస్తున్న వెనుకబడిన వర్గాలపై ప్రభుత్వం 1970ల నుంచి ప్రయోగిస్తున్న నిర్బంధం కూడా చాలామందికి తెలుసు.

అంతెందుకు ప్రభుత్వ అభివృద్ధి పథకాలు ఈ వర్గాలకు తీరని నష్టం కలిగిస్తున్నాయి. ఉదాహరణకు చేపల పెంపకం పథకం చూడండి. ఈ పథకం క్రింద ప్రభుత్వం చేపల పెంపకాన్ని ప్రోత్సాహిస్తుంది. ఆ చేపలను పట్టి అమ్మే హక్కును వేలంవేసి తన రాబడిని పెంచుకోవాలని చేస్తుంది. ఇప్పటి వరకు చేపలుపట్టి బతుకుతున్న వాళ్ళకు దీనివలన నష్టం. వాళ్ళ దగ్గర కాంట్రాక్టు తీసుకోవడానికి డబ్బులేదు. డబ్బున్న వాళ్ళు కాంట్రాక్టు పడతారు. ఆ తర్వాత వాళ్ళు ఇప్పటి చేపలు పట్టడం వృత్తిగా ఉన్న వాళ్ళను కూలీలుగా పెట్టుకుంటారు. తత్ఫలితంగా చేపలుపట్టేవారు ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాలి. మరి ప్రభుత్వ పథకాన్ని ఎదిరిస్తూ చేపలుపట్టేవారు, గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీ ముందు ధర్నా చేశారు. ఊరేగింపుతీశారు నిరాహారదీక్ష చేశారు. ఇది జరగడానికి కొద్దిరోజులముందు రిజర్వేషన్లు పెంచిన ప్రభుత్వం, సంఘం సభ్యులపై లాఠీచార్జి జరిపింది కాని న్యాయసమ్మతమైన వారి సమస్యలను పరిష్కరించలేదు.

ఒకవైపు ప్రభుత్వ నిర్ణయం పాక్షికంగానే వెనుకబడిన వర్గాల సమస్యను పరిష్కరిస్తుండగా, మరొకవైపు ఈ కొద్దిపాటి రాయితీలను కూడా పెద్ద ఎత్తున వ్యతిరేకించే వర్గం తయారైంది. వీళ్ళు చెప్పేదేమిటంటే మార్కులు ఎక్కువ వచ్చిన వాళ్ళకే సీట్లు ఇవ్వాలి. అలా జరగకపోతే విద్యాప్రమాణాలు తగ్గి దేశప్రగతికే ముప్పు ఏర్పడుతుంది. అంతేకాని కులంపేర రిజర్వేషన్లు పెంచి ఓపెన్ కోటా సీట్లను తగ్గించి ప్రతిభావంతులకు అన్యాయం చేయవద్దు. వెనుకబడినవాళ్ళు ఉన్నత కులాల్లోకూడా ఉన్నారు, వాళ్ళ వలెనే వెనుకబడిన కులాలవాళ్ళు సీట్లు, ఉద్యోగం కోసం ప్రయత్నించవచ్చు. ఈ వాదన కొత్తదేమీకాదు. దాదాపు స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి రిజర్వేషన్లను వ్యతిరేకించేవారు ఈ విషయాలనే చెప్తున్నారు.

వీళ్ళు చెప్తున్నట్టు సీట్లు తగ్గడానికి, విద్యాప్రమాణాలు తగ్గటానికి, ఉద్యోగాలు రాకపోవడానికి రిజర్వేషన్లు కారణంకాదు. అసలు ప్రతిభ అన్నది మార్కులు కొలమానంగా నిర్వచిస్తున్నారు. ప్రతిభ పెరగడానికి ముందుస్కూల్లో అనువైన సౌకర్యాలు ఉండాలి 35% కాలేజీలలో, 50%పైన స్కూళ్లలో కనీసవసతులు లేవు. ఈ వాతావరణంలో విద్యార్థుల ప్రతిభ ఎట్లా పెరుగుతుంది. అసలు ఉన్నవిద్యాలయాలలో కూడా బోధన పరీక్షలచుట్టూతిరుగుతుంది. పాఠ్య పుస్తకాలు బట్టీపట్టి పరీక్షల్లో సరిగ్గా గుర్తుంచుకొని రాస్తే ఎక్కువ మార్కులు వస్తాయి. అంతేకాని విషయాలను తెలుసుకొని నిత్య జీవితంలో అనువర్తింప చేయడమనేది మన దేశంలో విద్యావ్యవస్థ ఎప్పుడూ ప్రోత్సాహించలేదు. పోనీ ఇప్పుడున్న పరిస్థితులలోనైనా విభిన్న సామాజిక స్థాయిలనుంచి వచ్చినవారు సమానంగా పోటీపడి సమానమైన మార్కులు సంపాదించడం సాధ్యంకాదు. అందుచేత సామాజిక అంతరాలున్నంత కాలంలో ప్రతిభా, పాటవాలలో తేడా లుంటాయి.

ఇకపోతే కాలేజీసీట్ల గురించి - కాలేజీసీట్లకోసం పోటీపడే వారిసంఖ్య పెరుగుతున్నంతగా కాలేజీసీట్లు పెరగడంలేదు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వమే సీట్లు తగ్గించింది. అంతేకాక ఈ మధ్యనే సమర్పించిన వైస్ఛాన్సలర్ల కమిటీ నివేదికలో 1995దాకా ప్రభుత్వం సీట్లు పెంచకూడదని ఉన్నది.

రెండవది ఉద్యోగాలకు సంబంధించినది. రిజర్వేషన్ల వలన ఉద్యోగాలు తగ్గిపోతున్నాయట, నిజానికి రిజర్వేషన్లు అన్ని ఉద్యోగాలకు వర్తించవు. పరిశ్రమలు, దుకాణాలు వంటి సంస్థల్లో రిజర్వేషన్లు లేవు. మొత్తం 17, 59, 600 మంది 1981 నాటికి ఈ సంస్థల్లో పనిచేస్తున్నారు. అదీకాక కేంద్ర ప్రభుత్వరంగంలో కూడా వెనుక బడిన వర్గాలకు రిజర్వేషన్లు లేవు ఒక రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలకే కొత్త రిజర్వేషన్లు వర్తిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వంలో 5, 90, 900 మంది 1981 నాటికి ఉన్నారు. వీటిలో రిజర్వేషను వెనుకబడిన వర్గాలకు అమలైంది 1976 నుంచే. ఇందులో ఉన్నత స్థాయిల్లోని ఉద్యోగాలలో 60% దాకా ఉన్నత కులాల వారే ఉన్నారు. ఇకపోతే వచ్చే ఉద్యోగాలకే రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఇక్కడ గమనించవలసిన అంశంఏమిటంటే ప్రభుత్వోద్యోగాలు క్రమేపి తగ్గుతున్నాయి. సామర్థ్యంపేర, ఆధునికీకరణ పేర, పొదుపు పేర రిక్రూట్మెంటలను చాలా కాలంగా నిలిపి వేశారు. అన్నగారు కొత్త ఉద్యోగాలు సృష్టిస్తానని రిటైర్మెంట్ వయసు తగించి కూడా కొత్తగా ఉద్యోగాలు సృష్టించ లేక పోయారు. ఇప్పుడు ఉన్న పళంగా రిక్రూట్మెంట్పై నిషేధాలు తొలగిస్తే 9,000 ఉద్యోగాలువస్తాయి. మరి నిరుద్యోగుల సంఖ్య 25 లక్షలు.

ఈ విషయాలను పరిశీలించి నప్పుడు రిజర్వేషన్ల వలన సామర్థ్యం తగ్గుతుంది, సీట్లు తగ్గుతాయి, ఉద్యోగాలు తగ్గుతాయని వాదించడం కేవలం రిజర్వేషన్లను వ్యతిరేకించడం కోసం సృష్టించిన అభూత [illegible] ప్రమేయం లేకుండానే జరుగుతున్నాయి. [illegible] ఉద్యోగాలు తగ్గుతాయన్న వాదన కూడా ఉన్నది. అయితే 70% పైన ఉన్న నిమ్నకులాలు చదువు కోటానికి, ఉద్యోగం చేయటానికి అర్హులుకారా అని ప్రశ్నించ వలసి వస్తుంది. సామాజికంగా, ఆర్థికంగా నిమ్న కులాలు తరతరాలుగా తీరని అణచివేతకు గురయ్యారు. వాళ్ళను అంటరాని వాళ్ళకు, సంస్కారం లేని మనుషులుగా వేళ ఏళ్లుగా ఉన్నత వర్ణాలు వాళ్ళను కించ పర్చాయి. వాళ్ళకు విజ్ఞానం సంపాదించుకొనే హక్కును కూడా ఇవ్వలేదు. ఈ స్థితిలో వాళ్ల ఇతర వర్ణాలతో, అభివృద్ధి చెందిన వర్గాలతో పోటీ పడే పరిస్థితుల్లో లేరు. ఉన్నత వర్ణాల, వర్గాల స్థాయికి ఎదగాలంటే వాళ్ళకు ప్రభుత్వం ఆర్థికాభివృద్ధికి సహాయం చేయడమే కాదు రిజర్వేషన్లు కూడా కల్పించాలి. అంతేకాని మిగతా వర్గాలతో పాటు పోటీపడి సీట్లు, ఉద్యోగాలు సంపాదించు. కోవాలనటం వాళ్ళు చదువు కోవద్దు, ఉద్యోగంచేయవద్దు అనడమే అవుతుంది. ఉస్మానియా యూనివర్సిటీలోనే వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థుల సంఖ్య రిజర్వేషన్లు వచ్చిన తర్వాత, స్కాలర్షిప్పులు పెంచిన తర్వాతనే సాధ్యమైంది. అంతెందుకు యూనివర్సిటీ టీచింగ్ ఉద్యోగాలలో కూడ వెనుకబడిన వర్గాలు రిజర్వేషన్లు వచ్చిన తర్వాతే ఎన్నికయ్యారు.

ఉన్నత వర్ణాలలో బీద ప్రజలు లేరా, అంటే ఉన్నారు. కానీ వాళ్ళను రిజర్వేషన్లు ఎదిరించటానికి సాధనంగా వాడుకొంటున్నారు కానీ వాళ్ళ సమస్యల పరిష్కారం కోరి మాత్రం కాదు. ఏ ఉన్నత వర్ణంలో వ్యక్తికైనా ఆ వర్ణంలో బీదలున్నారని రిజర్వేషన్లు పెంచగానే గుర్తొచ్చింది. వాళ్ళకు సమస్యలున్నాయని గుర్తించారు. ఇక్కడ బీద ప్రజలు తమ సమస్యల కోసం వెనుక బడిన వర్గాల సమస్యలను సాను భూతితో అర్థం చేసుకోవాలి. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లతో బాటు ఆర్థికాభివృద్ధి పథకాలు అమలు చేయాలని ఆ అమలులో బాటు ఆర్థికంగా వెనుకబడిన ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయాలి. మిగతా అందరిలాగా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేహక్కు ఉందని గుర్తించాలి. అలాగుర్తించి నప్పుడే అందరి హక్కుల కోసం సమిష్టిగా కృషి చేయడం సాధ్యమవుతుంది. *